సాక్షి
చిత్తూరు
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



నీవా నది అక్రమార్కులకు నిధి

నీవా నది నుంచి అక్రమార్కులు ఇసుకను భారీగా తమిళనాడుకు తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరు. - 8లో



చీకట్లో ఇసుక దందా

నగరి కుశస్థలి నదిలో నుంచి అక్రమార్కులు రాత్రి వేళ సైతం ఇసుకను తరలిస్తుండగా యువకులు ట్రాక్టర్లను పట్టుకున్నారు. - 8లో



పోర్టల్‌లో అప్‌లోడ్ చేయండి

స్వర్ణాంధ్ర-2047 క్యాంపెయిన్‌కు సంబంధించి ప్రజల స్పందనను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

ఉద్యోగ మేళాకు స్పందన

- 88 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు



నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : యువత ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు భవిష్యత్‌లో మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామన్నారు. ఈ మేళాలో పలు ప్రైవేట్ కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. యువత ప్రభుత్వ, బ్యాంకింగ్, ప్రైవేట్ సెక్టార్లలో ఉద్యోగాలు సాధించేవరకు నిరంతరం ప్రయత్నిస్తుండాలన్నారు. చిన్న ఉద్యోగమైనా సరే నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని తెలిపారు. ఈ మేళాలో 190 మంది వివిధ ప్రాంతాల నుంచి పాల్గొనగా, 88 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి కలెక్టర్ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేడీఎం సరితారెడ్డి, వివిధ ప్రైవేట్ సంస్థల హెచ్‌ఆర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక్క కంపార్ట్‌మెంట్ నిండింది. సోమవారం అర్ధరాత్రి వరకు 65,604 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,266 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 6 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోనికి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించారని తెలియజేస్తోంది.

మున్సిపాలిటీల్లో ఇంజినీర్ల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలోని పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వెంకటప్రసాద్, బి.రమణను తిరుపతి కార్పొరేషన్‌కు, నంద్యాలలో ఉన్న బి.మధుకుమార్‌ను తిరుపతి కార్పొరేషన్‌కు, తిరుపతిలో ఉన్న ఎం.రవీంద్రారెడ్డిని నగరికి, టి.శ్రావణిని చిత్తూరుకు, ఎ.విజయ్‌కుమార్‌రెడ్డిని కల్యాణదుర్గానికి, వి.సంజీవ్‌కుమార్‌ను శ్రీకాళహస్తికి, పొద్దుటూరులో ఉన్న జి.వెంకటరమణను చిత్తూరుకు, శ్రీకాళహస్తిలో ఉన్న లలితను తిరుపతికి, నగరిలో ఉన్న పి.నరేష్‌బాబును తిరుపతికి బదిలీ చేశారు. ఇక మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్లలో చిత్తూరులో పనిచేస్తున్న ఎస్.రజని తిరుపతికి, పుంగనూరులో ఉన్న బి.కృష్ణకుమార్‌ను వైఎస్సార్ కడప కార్పొరేషన్‌కు, తిరుపతిలో ఉన్న ఎం.నాగేంద్రకుమార్‌ను రాజంపేటకు, సి.తేజశ్వినిని శ్రీకాళహస్తికి, పికె.ప్రశాంతిని చిత్తూరుకు, పలమనేరులో ఉన్న ఎస్.రూపేష్‌ను మదనపల్లెకు, నగరిలో ఉన్న కె.రమేష్‌ను పుత్తూరుకు, శ్రీకాళహస్తిలో ఉన్న వి.సాయిసింధును తిరుపతికి, పుత్తూరులో ఉన్న ఎ.హేమశేఖర్‌ను నగరికి, గూడూరులో ఉన్న బి.నరసింహులును రాయదుర్గానికి, సీవీఆర్ వైష్ణవిని కర్నూలుకు బదిలీ చేశారు.

స్టోర్లకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్లకు ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చిందని ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 800, సైడ్‌హారమ్స్ 3500 వచ్చిందన్నారు. సంబంధిత ఏఈలు వర్క్ఆర్డర్లు పెట్టి మెటీరియల్స్ డ్రా చేసుకోవాలని వివరించారు.

27న పుత్తూరులో జాబ్‌మేళా

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈనెల 27వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.కోటేశ్వరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, టీవీఎస్ ఇండియన్, బీజెడ్ ఫిన్సర్వ్ గ్రూప్ ఆఫ్ బ్యాంక్ జోన్, అపోలో ఫార్మసీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్/ఫెయిల్ విద్యార్హత, 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్లతో పాటు, ఒరిజినల్ ఐడీ ప్రూఫ్‌తో, వివరాలకు 63009 54441, 79935 02145 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎర్ర వనం.. ఉనికే ప్రశ్నార్థకం..

దేశంలోనే స్వచ్ఛమైన ప్రాణవాయువు (ఆక్సిజన్) అందుతున్న నగరాల్లో చిత్తూరుకు చోటు ఉంది. కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) రెండు నెలల క్రితం ప్రకటించిన ర్యాంకుల్లో చిత్తూరుకు సముచిత స్థానం దక్కిందని ప్రకటించింది. దీనికి ప్రధాన కారణం నగర నడిబొడ్డున ఉన్న రిజర్వు ఫారెస్టులోని ఎర్రచందనం వృక్షాలు. ప్రస్తుతం ఈ వృక్షాల ఉనికి ప్రమాదంలో పడింది. అధికార యంత్రాంగం పట్టించుకోకుంటే భావితరాలకు కనిపించే అవకాశం ఉండకపోవచ్చు. అలాగే స్వచ్ఛవాయువు లభ్యం కూడా ప్రశ్నార్థకం అవుతుంది.



చిత్తూరు రిజర్వు ఫారెస్టులోని ఎర్రచందనం వృక్షాలు

చిత్తూరు అర్బన్: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణవాయువు దొరికే నగరాలను వేళ్ల మీద లెక్కించవచ్చు. ఎక్కడా లేని విధంగా చిత్తూరు నగర నడిబొడ్డున ఉన్న రిజర్వు ఫారెస్టు స్వచ్ఛవాయువు(గాలి) దొరికే నగరంగా ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ తొలిసారిగా 1959లో ఎర్రచందనం మొక్కలు నాటినట్లు చరిత్ర చెబుతోంది. 1959 నుంచి 1970 వరకు సాగిన ఎర్రచందనం మొక్కల పెంపకం అటవీశాఖ యంత్రాంగం కృషి ఫలితంగా పెద్దవనంగా మారింది. కేవలం శేషాచలం అడవులకే పరిమితమైన ఎర్రచందనం వృక్షాలు ఇక్కడి నేల స్వభావికం, వాతావరణం కారణంగా చిత్తూరు నగరంతో పాటు సత్యవేడు, యాదమరి, కార్వేటినగరం, పుత్తూరు, నాగలాపురం ప్రాంతాల్లో విస్తారంగా వ్యాపించాయి. ఒక్క చిత్తూరు నగరంలోనే ఎర్రచందనం చెట్లు 28 హెక్టార్లలో విస్తారంగా ఉన్నాయి. దాదాపు 11,200 ఎర్రచందనం వృక్షాలు చిత్తూరుకు సొంతమయ్యాయి. 2021లో జరిగిన ఎర్రచందనం వృక్షాల గణన తరువాత ఇక్కడ కేవలం 3,250 వృక్షాలే ఉన్నట్లు గుర్తించారు. ఈ మూడేళ్లలో 200లకు పైగా వృక్షాలు మాయమయ్యాయి. మరో 50 ఏళ్లలో అసలు చిత్తూరులో ఎర్రచందనం వృక్షాలే కనిపించకపోవచ్చు.



ఎందుకిలా..?



ఎర్రచందనం వృక్షాల జీవితకాలం వందేళ్లకు పైనే ఉంటుంది. ఒక్కసారి చెట్టు ఎదిగిన తరువాత ఎలాంటి వాతావరణాన్ని అయినా తట్టుకుని బతికే లక్షణం వీటి సొంతం. కానీ చిత్తూరులో ప్రస్తుతం ఎర్రచందనం వృక్షాల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. వృక్షాల్లో కొన్ని కృశించిపోయి, కుంగిపోయి ఎండిపోతున్నాయి. కారణాలు పరిశీలిస్తే..ఒక చెట్టుపైన మరో చిన్న మొక్క జీవం పోసుకుని.. క్రమంగా అవి విస్తరిస్తాయి. వీటినే వృక్షశాస్త్ర భాషలో ఎపీఫైట్స్ అంటారు. ఈ ఎపీఫైట్స్ తమకు ఆశ్రయం ఇచ్చిన వృక్షాలను చీల్చుకుంటూ, క్రమంగా వాటిని చంపేస్తాయి. కొన్ని చెట్లపై ఈ సంకేతాలు కనిపిస్తున్నాయి. మరికొన్ని వృక్షాల మొదళ్లలో చెద పురుగులు పట్టి, వృక్షం చివర వరకు వ్యాపించి చెట్లను తినేస్తున్నాయి. ఇవికాకుండా ఇక్కడ ఉన్న ఓ రకమైన ముళ్లతో ఉన్న తీగజాతి వృక్షాలు, ఎర్రచందనం చెట్లను పూర్తిగా చుట్టేస్తున్నాయి. చిన్నపాటి అటవీ ప్రాంతాల్లో కనిపించే ఈ వృక్షాలను వాడుక భాషలో కోరింత, పరికి వృక్షాలుగా పిలుస్తుంటారు. ఇవి ఎర్రచందనం చెట్లను చుట్టేస్తూ, అల్లుకుపోవడం వల్ల కూడా సరైన సూర్యరశ్మి అందకపోవడం, వర్షం పడినప్పుడు నీళ్లు వేరు వ్యవస్థకు చేరక వృక్షాల ఉనికి ఆందోళనకరంగా మారుతోంది. ఇటీవల రిజర్వు ఫారెస్టులో సందర్శకులు ప్లాస్టిక్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ వ్యర్థాలు భూమిలోకి పాకి, ఎర్రచందనం వృక్షాల ఎదుగుదలను అడ్డుకుంటున్నాయి. అయితే అధికారులు అసలు కారణాలను మాత్రం అన్వేషించడం లేదు.



చెదలు పట్టడంతో రంగుమారిన వృక్షాలు

పరిశోధలను పిలిపించి చూపిస్తే..!

చిత్తూరులోని రిజర్వు ఫారెస్టులో ఉన్న ఎర్రబంగారం కాపాడడానికి దాదాపు 30 మంది వరకు పని చేస్తున్నారు. వీరిలో రేంజర్‌తో పాటు సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు, ప్రొటెక్షన్ వాచెర్లు ఉన్నారు. తొలిగా ఎండిపోతున్న ఎర్రచందనం వృక్షాలను ఓ వృక్షశాస్త్ర పరిశోధకులను పిలిపించి చూపించాలి. తిరుపతిలో ఎర్రచందనం వృక్షాల పరిశోధనా కేంద్రం ఉంది. ఇక్కడి నిపుణులకు చూపించినా బాగుంటుంది. అలాగే వృక్షాలు ఎదుగుతున్న నేలకు సారవంత పరీక్ష, స్వభావం చూడాలి. అప్పుడే వీటికి కారణాలు తెలియడంతో పాటు వృక్షాలను బతికించుకోవడానికి మార్గాలు కూడా తెలిసే అవకాశం ఉంది. ఇక రిజర్వు ఫారెస్టులోకి ప్లాస్టిక్ వస్తువులను కచ్చితంగా నిషేధించాలి.



ఎండిపోయిన ఎర్రచందనం వృక్షాలు

వదిలేస్తే చెట్లే కనిపించవేమో..



ఎర్రచందనం చెట్లను కాపాడుకోవడం మన అందరి బాధ్యత. చిత్తూరులో కృశించిపోతున్న చెట్లను చూస్తే వీటిపై క్షుణ్ణంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. వృక్షాలకు ఎండ తగలకుండా అల్లుకుంటున్న మొక్కలను తొలగించడం, అడవి జంతువుల నుంచి కాపాడడానికి ఫెన్సింగ్ పెట్టడం, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చూడడం చేయాలి. అసలు పట్టించుకోకుండా వదిలేస్తే భావితరాలు ఈ చెట్లను చూసే పరిస్థితి ఉండకపోవచ్చు.

– డా.మీరాసాహెబ్, వృక్షశాస్త్ర అధ్యాపకులు, చిత్తూరు.

పరిశోధనలు చేయిస్తాం..



ఎర్రచందనం వృక్షాలు ఏటా కొన్ని పడిపోతున్నాయి. స్మగ్లర్ల బెడద బాగా తగ్గించాం. అడవి పందులు వృక్షాలను కొరికి, వాటి పొట్టును తినేస్తుండడం వల్ల కొన్ని చెట్లు బతకడం లేదు. ప్రకృతి పరమైన కారణాల వల్ల చెట్లు నేలకు ఒరిగిపోతున్నాయనే విషయాన్ని కూడా పరిశీలిస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి ఎర్రచందనం వృక్ష సంపద కాపాడుకోవడానికి పరిశోధనలు చేయిస్తాం.

– థామస్ కుమార్, ఫారెస్ట్ రేంజర్, చిత్తూరు.

సైంటిస్టులను పిలిపించి..



రిజర్వు ఫారెస్టులో అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. స్మగ్లర్లు లోపలకు రాకుండా ఉండాలని రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి కందకాలు తవ్వి ఆ మట్టినంతా ఎర్రచందనం వృక్షాలపై పడేశారు. ఇలా చేస్తే చెట్లకు నీళ్లు, కాంతి అందదు. సైంటిస్టులను పిలిపించి వృక్షాలను పరిశీలించడం చేస్తే చెట్లను కాపాడుకున్నట్లు అవుతుంది.

– సత్యనారాయణ, వాకర్, చిత్తూరు

డ్వామా ఇన్‌చార్జ్ పీడీగా గంగాభవానీ



పీడీగా బాధ్యతలు స్వీకరించిన గంగాభవానీ

చిత్తూరు కలెక్టరేట్ : డ్వామా (జిల్లా నీటి యాజమాన్య సంస్థ) ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవానీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడు నెలలుగా ఆ పోస్టులో రెగ్యులర్ పీడీగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ రిలీవ్ అయ్యారు. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కేడర్‌లో ఉన్న ఆయనను సీసీఎల్‌ఏలో రిపోర్టు చేసుకోవాలని ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు రిలీవ్ అయిన ఆయన రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసుకున్న తర్వాత తదుపరి పోస్టింగ్‌ను ఇవ్వనున్నారు. రెగ్యులర్ పీడీ బదిలీ కావడంతో ఏపీడీగా విధులు నిర్వహిస్తున్న గంగాభవానీ పీడీగా అదనపు బాధ్యతలను స్వీకరించారు. కాగా ఆమె కూడా ఇటీవల నెల్లూరు డ్వామా పీడీగా బదిలీ అయ్యారు. జిల్లా పీడీగా నియమితులైన రవికుమార్ జిల్లాకు విచ్చేసిన వెంటనే ఆమె రిలీవ్ అయి నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్తారని కార్యాలయ సిబ్బంది వెల్లడించారు.

కుప్పంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీన కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, కుప్పం నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని కోరారు. అధికారులు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

బాధ్యతల నుంచి తప్పించారు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌శాఖ ఎస్‌పీఎం పలమనేరు సబ్‌ఇంజినీర్ సూర్యతేజ, పీలేరు సబ్‌ఇంజినీర్ కమల్‌గణేష్‌ను తాత్కాలికంగా బాధ్యతల నుంచి తప్పిస్తూ ఎస్‌ఈ సురేంద్రనాయుడు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌పీఎంలో రాగి, అల్యూమినియం స్క్రాప్‌లో జరిగిన అవకతవకలపై విచారణ జరపనున్నట్లు తెలిపారు. లెక్క తేలేవరకు వారిని పక్కన పెట్టామన్నారు. ఎస్‌పీఎం పలమనేరు ఇన్‌చార్జ్ ఏఈగా చిత్తూరు ఎస్‌పీఎం ఏఈ మోహన్‌శెట్టి, పీలేరుకు మదనపల్లె ఎస్‌పీఎం ఏఈ శ్రీనివాసులునాయుడుకు అదనపు బాధ్యతలు ఇచ్చామన్నారు.

సత్య ప్రమాణానికి సిద్ధమా చంద్రబాబు ?

- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



గంగాధర నెల్లూరు: అసత్య ఆరోపణలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. పుత్తూరులోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపిస్తున్న చంద్రబాబు నాయుడు తిరుమలలోని వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సత్య ప్రమాణానికి సిద్ధమా ? అని ప్రశ్నించారు. ఆలయ ఈఓ అసలు ఆ నెయ్యిని వాడలేదని చెప్పినప్పుడు, ఆరోపణలు ఎలా చేస్తారని అన్నారు. గతంలో నందిని నెయ్యి వద్దని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదే నందిని నెయ్యిని ఎందుకు సరఫరా చేయలేదని మాట్లాడడం విడ్డూరమన్నారు. తన రాజకీయ లబ్ధి కోసం వేంకటేశ్వరస్వామితో రాజకీయ ఆటలు ఆడిన చంద్రబాబుకు ఆ దేవుడే శిక్ష విధిస్తాడన్నారు. లడ్డూ తయారీలో ఎలాంటి అపచారం జరగలేదని, కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాజకీయ కుట్రతో సీఎం చంద్రబాబు అసత్య ఆరోపణలతో రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. టీడీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ఇప్పటికే తిరుమలలో సత్య ప్రమాణం చేశారని, వైవీ సుబ్బారెడ్డి కూడా కుటుంబ సభ్యులతో కలసి ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ''మరి మీరు ఎప్పుడు సత్యప్రమాణం చేస్తారు చంద్రబాబు'' అని నారాయణస్వామి ప్రశ్నించారు. కల్తీ నెయ్యిపై సీబీఐ, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిలతో కమిషన్ వేసి వాస్తవాలను నిగ్గు తేల్చాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ ప్రధానికి లేఖ రాశారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ ముందు తమ ఆత్మలను, మనస్సును శుద్ధి చేసుకుని మాట్లాడాలని సూచించారు.

చంద్రప్రభపై గణనాథుడి దివ్యతేజం



పుష్పాలంకరణలో చంద్రప్రభ వాహనం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కాణిపాకం: ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి మంగళవారం చంద్రప్రభవాహనంపై చిద్విలాసం చేశారు. ఉదయం మూలస్థానంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. స్వామివారికి చందన అలంకరణ, విశేష పూజలు చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కలిపించారు. రాత్రి అలంకార మండపంలో సిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి వారి ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం చేశారు. సుగంధభరిత పుష్పాలు, పట్టు పీతాంబరాలతో అలంకరించి వేంచేపు చేశారు. అనంతరం చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ గురుప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

క్షీర కలశాలతో ఊరేగింపు..

చంద్రప్రభ వాహన సేవ సందర్భంగా ఉభయదారులు క్షీర కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన ఆలయ కల్యాణ వేదికలో ఉత్సవమూర్తి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అలాగే అగరంపల్లికి చెందిన మాజీ దేవదాయశాఖ ఏడీసీ కేశవులు కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ ఉభయదారుల చేతుల మీదుగా ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు కల్పవృక్ష వాహనసేవ..

కాణిపాక ఉత్సవంలో భాగంగా బుధవారం స్వామివారు కల్పవృక్ష వాహనంలో దర్శనమిస్తారని ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం జరుగుతుందన్నారు. రాత్రి కల్పవృక్ష వాహన సేవ ఉంటుందని, ఈసందర్భంగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో పీడీ చంద్రశేఖర్‌రాజు

పుత్తూరు: రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో వడమాలపేట జెడ్పీహెచ్ఎస్ క్రీడాకారులు కాంస్య పతకాలతో మెరిశారు. ఈనెల 22 నుంచి 24 వరకు తిరుపతిలో ఏపీ పాఠశాలల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల జూడో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వడమాలపేట ఉన్నత పాఠశాలకు చెందిన లీలా (7వ తరగతి) 27 కేజీల విభాగంలో, వెన్నెల (9వ తరగతి) 32, షణ్ముగం (9వ తరగతి) 50 కేజీల విభాగంలో కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం కరుణానవనీతం, పీడీ చంద్రశేఖర్ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇద్దరు హౌసింగ్ ఈఈల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా హౌసింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)లుగా ఇద్దరిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ఉన్న విధులు నిర్వహిస్తున్న పలువురికి ఇటీవల ఈఈలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతి పొందిన ఎం.శ్రీనివాసరావును కుప్పం డివిజన్ ఈఈగా, గోపాలనాయక్‌ను నగరి ఈఈగా నియమించారు. వారు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో డ్రైవర్ మృతి


ఆత్మహత్య చేసుకున్న చలపతి

బంగారుపాళెం: కుటుంబ కలహాల కారణంగా స్కూల్ వ్యాన్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని పాలేరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వెంకటేశులు కుమారుడు చలపతి(40) బంగారుపాళెంలో ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింత గింజల లారీ బోల్తా



కుప్పంరూరల్: చింత గింజల లోడుతో తమిళనాడు నుంచి ఆంధ్రా వైపు వస్తున్న ఓ లారీ కుప్పం అటవీ ప్రాంతంలో బోల్తాపడి, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడడంతో పెను ప్రమాదమే తప్పింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి ఓ లారీలో చింత గింజలను వేసుకుని పుంగనూరుకు వస్తుండగా కుప్పం మండలం, నడుమూరు అటవీ ప్రాంతం వద్ద రాగానే మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో లారీలోని గింజలు మొత్తం నేలపాలయ్యాయి. డ్రైవర్ సాదిక్ అలీ స్వల్పంగా గాయపడగా, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు లారీలో నుంచి డ్రైవర్‌ను బయటకు తీసి కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నామినేటెడ్ పదవుల్లో పలువురికి చోటు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి పలువురు టీడీపీ నేతలకు చోటు లభించింది. ఇదే సమయంలో జిల్లాలో బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులకు ఈ జాబితాలో స్థానం దక్కలేదు. తిరుపతికి చెందిన ఎ.రవినాయుడును స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్‌గా, కుప్పానికి చెందిన మునిరత్నంను ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా, చిత్తూరుకు చెందిన మాజీ మేయర్ కటారి హేమలతను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యురాలిగా, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా వూకా విజయకుమార్, ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా నగరికి చెందిన గంజి మాధవయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

నీవా నది.. అక్రమార్కులకు నిధి

- జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఆగని ఇసుక దందా
- తాజాగా తమిళనాడుకు ఇసుక తరలిస్తూ బోల్తాపడిన లారీ
- వారం కిందట అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన కంటైనర్
- ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న కూటమి నాయకులు
- సామాన్యులకు దొరకని ఇసుక


బోల్తా పడిన ఇసుక లారీని క్రేన్లతో పైకి లేపుతున్న దృశ్యం

కార్వేటినగరం: జిల్లాకేంద్రం చిత్తూరు, పక్కనే ఉన్న గంగాధర నెల్లూరు నియోజకవర్గం సరిహద్దుల్లో ఉన్న నీవానది కూటమి నాయకుల అక్రమాలకు నిధిగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నీవానదిని అక్రమ ఇసుక వ్యాపారానికి నిలయంగా మార్చుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నీవానదిపై ఉన్న వంతెన దుస్థితికి చేరుకుందని దీన్ని దృష్టిలో పెట్టుకుని నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది. కానీ ఇసుకాసురులు మాత్రం అధికారుల ఆదేశాలను లెక్క చేయకుండా గత నెలలో జుల్లో రాత్రికి రాత్రే ట్రాక్టర్లు, లారీలు, పెద్దపెద్ద కంటైనర్లతో ఇసుక దోపిడీ చేశారు. ఇక్కడి నేతలకు రాష్ట్రస్థాయి నాయకులతో సంబంధాలు, వీరికి బడా నాయకుల చొరవతో గంగాధరనెల్లూరు నుంచి చెన్నై వరకు నీవానది నుంచి ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అక్రమ ఇసుక తరలింపుపై స్వయంగా పోలీస్ అధికారులకు సమాచారం అందించి ఇసుక డంపులపై దాడులు చేయించారు. అయినా ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఇసుకాసురులు మాత్రం మరింత రెచ్చిపోతున్నారు. రాత్రికి రాత్రే లారీలతో పాలసముద్రం సరిహద్దుల్లోని తమిళనాడుకు తరలిస్తూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అతివేగం వల్లే ఇసుక లారీ బోల్తా ..

నీవానది నుంచి అక్రమ ఇసుక రవాణా అరికట్టడంలో పోలీస్ అధికారులకు సవాల్‌గా మారింది. సోమవారం రాత్రి నీవానది నుంచి తమిళనాడుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ డ్రైవర్ అతి వేగంగా వెళ్లడంతో పాలసముద్రం మండలం కనికాపురం వద్ద బోల్తా పడింది. దీంతో గుట్టు రట్టు కావడంతో లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఇలా ఎన్నో వందల లోడ్ల ఇసుకను పోలీసుల కళ్లు గప్పి తరలించారని విమర్శలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకే ఇసుక అందుబాటులోకి తీసుకొస్తామన్న కూటమి ప్రభుత్వం పేదలకు ఇసుక అందని ద్రాక్షలా చేసింది. కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం మండలాల్లో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారు ఇసుక కొరతతో ఇబ్బంది పడుతున్నారు. అధిక ధర చెల్లించి సత్యవేడు నియోజకవర్గం నుంచి ఇసుకను కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. కొందరు వర్షాలకు రోడ్డు పక్కకు కొట్టుకొచ్చిన ఇసుకతో తేలికపాటి నిర్మాణాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాన్యులు కోరుతున్నారు.

కేసు నమోదు..

పాలసముద్రం : జీడీ నెల్లూరు మండలం తూకుంద్రం గ్రామానికి చెందిన సుధాకర్ నాయుడు ఏపీ39యూఎల్ 9991 నంబరు లారీని లీజుకు తీసుకున్నాడు. అందులో రోజూ చెన్నైకి ఇసుక తరలిస్తుంటాడు. అందులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున 36 టన్నుల ఇసుకను చెన్నైకి చెందిన మునస్వామికి అధిక రేటుకు మాట్లాడుకుని తరలిస్తుండగా బలిజకండ్రిగ-చిత్తూరు జాతీయ రహదారి కన్నికాపురం గ్రామం సమీపంలో బోల్తా పడింది. ఎస్ఐ భారతి తమ సిబ్బందితో వెళ్లి లారీ డ్రైవర్ పవన్(27), క్లీనర్ విజయ్(26)ను అదుపులోకి తీసుకున్నారు. వారిది తమిళనాడులోని తిరువళ్లూరు. సీఐ హనుమంతప్ప అక్కడికి చేరుకుని రెండు క్రేన్లతో లారీని లేపి ఇసుకను సీజ్ చేసి, లారీ యజమాని శ్రీనివాస్‌రెడ్డి(52), సుధాకర్ నాయుడు, డ్రైవర్ పవన్, క్లీనర్ విజయ్‌పై కేసు నమోదు చేశారు. సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ అక్రమంగా తమిళనాడుకు ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే వారిపై పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.


వారం కిందట ఇసుకతో పట్టుబడిన భారీ కంటైనర్

ప్రియురాలి కోసం బుర్కాతో హాస్టల్లోకి..

- కటకటాలపాలైన యువకుడు

గుడుపల్లె: ప్రియురాలి కోసం బాలికల హాస్టల్లోకి బుర్కాతో ప్రవేశించేందుకు యత్నించిన ఓ యువకుడు కటకటాలపాలైన ఘటన గుడుపల్లె మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. కేరళ రాష్ట్రం త్రిసూర్‌కు చెందిన ఓ విద్యార్థిని గుడుపల్లె మండల పరిధిలోని ఓ ప్రైవేట్ వైద్య కళాశాలలో నర్సింగ్ చదువుతోంది. ఆమె ప్రియుడు బెంగళూరు నగరంలోని ఓ హోటల్లో పని చేస్తుంటాడు. వీరిద్దరూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో గత నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆ యువకుడు తన ప్రియురాలిని చూసేందుకు సోమవారం కళాశాల వద్దకు వచ్చాడు. బుర్కా ధరించి విద్యార్థిని వసతి గృహంలోకి ప్రవేశించేందుకు యత్నించాడు. దీన్ని గమనించిన రోడ్డుపై ఉన్న ఆటో డ్రైవర్లు వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన వార్డెన్ వెంటనే ఆ యువకున్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారుడు. గుడుపల్లె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల వినియోగదారులు సమస్యలను తెలియజేవచ్చని చెప్పారు. వాటిని నమోదు చేసుకుని పరిష్కారం కోసం అధికారులు కృషి చేస్తారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు.

అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు పెద్దిరెడ్డి పరామర్శ


చెంగమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కల్లూరు(పులిచెర్ల) : మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. మంగళంపేటకు చెందిన రామనారాయణ, చెరుకువారిపల్లెకు చెందిన దివంగత రామిరెడ్డి భార్య చెంగమ్మ, ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన దివంగత సీతాపతిరెడ్డి భార్య రంగమ్మ కొద్ది రోజుల క్రితం మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను పెద్దిరెడ్డి పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, విరుపాక్షి జయచంద్రారెడ్డి, ముర్వత్‌బాషా, పోకల చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి, చెంచురెడ్డి, దాము, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ప్రభుత్వ ఖాజీగా హాఫీజ్ మహ్మద్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పుంగనూరు ప్రభుత్వ ఖాజీగా హాఫీజ్ మౌలానా మౌల్వి మహమ్మద్ ఇజాజ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ సెక్రటరీ హర్షవర్ధన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019వ సంవత్సరంలో అప్పటి కలెక్టర్ ఇచ్చిన నివేదికను అనుసరించి ప్రస్తుతం ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆయన 10 ఏళ్ల పాటు ప్రభుత్వ నియమ, నిబంధనలను అనుసరించి పుంగనూరు ప్రభుత్వ ఖాజీగా పని చేయాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

పోర్టల్‌లో అప్‌లోడ్ చేయండి

- స్వర్ణాంధ్ర విజన్ కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ పూర్తి చేయండి
- జిల్లాస్థాయి డాక్యుమెంట్ తయారీకి ప్రత్యేక కమిటీలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ


పౌరసరఫరాల శాఖ విభాగంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర-2047 క్యాంపెయిన్‌లో ప్రజల స్పందనను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్వర్ణాంధ్ర 2047 విజన్ కరపత్రాలు, స్టిక్కర్లను ఇంటింటికీ పంపిణీని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ పాంప్లేట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి ప్రతిస్పందనలను సచివాలయాల వారీగా డిజిటల్ అసిస్టెంట్లతో జాబితా తయారు చేయించాలన్నారు. డీఈఓ జిల్లాలోని ఎంఈఓల పరిధిలో ప్రతి హైస్కూల్, కళాశాలల్లో ఈ నెల 27 నుంచి 29 వరకు స్వర్ణాంధ్ర 2047పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి మండలానికి ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేయాలని తెలిపారు.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు..

స్వర్ణాంధ్ర 2047 భవిష్యత్ కార్యాచరణ జిల్లాస్థాయి డాక్యుమెంటరీ తయారీకి జిల్లా, మండల స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాస్థాయి కమిటీలో సీపీఓ, డ్వామా పీడీ, డీఆర్‌డీఏ పీడీ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, హార్టికల్చర్ డీడీలు, మండల స్థాయి కమిటీలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, మండల అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ అధికారులు, హౌసింగ్ ఏఈ, మెడికల్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ, పరిశ్రమల శాఖ నుంచి ఒక అధికారి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, ఈఓపీఆర్‌డీ, ఇతర మండల స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. కమిటీ సభ్యులు ఈ నెల 26వ తేదీ వరకు ఇది మంచి ప్రభుత్వంపై గ్రామ, వార్డు సభలు నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 5 వరకు జిల్లాలోని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఇదేనా పరిశుభ్రత అంటే ?

చిత్తూరు కలెక్టరేట్ : పరిశుభ్రత ఇలాగేనా ఉండేది అంటూ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయ్స్ డీఎం, జిల్లా పౌరసరఫరాల శాఖ, సర్వే శాఖ, సీపీఓ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ, సివిల్ సప్లయ్స్ డీఎం కార్యాలయాల్లో అస్తవ్యస్తంగా కాగితాలు, వస్తువులు ఉండడం చూసిన కలెక్టర్ ఆ శాఖల అధికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాల్లో పరిశుభ్రత ఇలాగేనా పాటించేదంటూ మండిపడ్డారు. కార్యాలయాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, డీఎస్ఓ శంకరన్, సివిల్ సప్లయ్స్ ఎండీ మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


సీజ్ చేసిన ఆభరణాలు, నిందితుడి అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

చిత్తూరు అర్బన్: తాళం వేసిన ఇళ్లలోకి చొరబడి చోరీలు చేసిన మహ్మద్ బిలాయ్ (32) అనే నిందితున్ని చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐలు జయరామయ్య, నెట్టికంటయ్యతో కలిసి డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇటీవల చిత్తూరు వన్‌టౌన్ పరిధిలో మూడు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తి విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అలాగే టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇదేకోవలో రెండు చోరీ కేసులు నమోదయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలతో తమిళనాడులోని గుడియాత్తం తాలూకా, వాలత్తూరుకు చెందిన ఎ.మహ్మద్ బిలాయ్ అనే నిందితుడు చోరీ చేసినట్లు గుర్తించారు. కాట్పాడి వద్ద నిందితున్ని అరెస్టు చేసి, రూ.8 లక్షల విలువ చేసే 130 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపించిన అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీపును ఢీకొన్న బస్సు

- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు



పుంగనూరు: అతివేగంగా హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సు జీపును ఢీకొన్న సంఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని సుగాలిమిట్ట వద్ద చోటుచేసుకుంది. పుంగనూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న జేబీటీ బస్సు సుగాలిమిట్ట వద్ద వెళ్తుండగా ఆటోను ఓవర్‌టేక్ చేయబోతూ ఎదురుగా పుంగనూరుకు వస్తున్న బొలేరో జీపును ఢీకొంది. ఈ ప్రమాదంలో జీపు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. బస్సు ముందుభాగం దెబ్బతింది. మండలంలోని మంగళం గ్రామానికి చెందిన జీపు డ్రైవర్ కృష్ణమూర్తి(35) తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే జేబీటీ బస్సు డ్రైవర్ కృష్ణయ్య (50) కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఇరువురిని 108లో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ రికార్డులతో రిజిస్ట్రేషన్


నిందితున్ని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

వెదురుకుప్పం: నకిలీ రెవెన్యూ రికార్డుల తయారీ కేసులో ఓ వ్యక్తిని వెదురుకుప్పం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. మండలంలోని గంటవారిపల్లెకు చెందిన పుల్లారెడ్డి కుమారుడు ఎస్.జయచంద్రా రెడ్డి జక్కిదొన గ్రామ రెవెన్యూ పరిధిలోని 513-16లో 0.66 సెంట్ల భూమికి సంబంధించి నకిలీ1బి, అండగల్ కాపీని తయారు చేసుకుని ఈనెల 13న పాకాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తప్పుడు డాక్యుమెంట్ల తయారీపై విచారణ చేయగా నకిలీవని నిర్ధారణ కావడంతో ఇటీవల కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం నిందితున్ని అరెస్టు చేసి పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

చీకట్లో ఇసుక దందా

ఇసుకాసురులు బరితెగించి ఇసుకను తోడేస్తున్నారు. స్టాక్ పాయింట్ లేని నదిలో తోడి యథావిధిగా తరలిస్తున్నారు. అక్రమార్కులు వాల్టా చట్టాన్ని కూడా లెక్కచేయకుండా కుశస్థలి నదిలో ఇసుకను మింగేస్తున్నారు. ప్రత్యేకించి రాత్రి పూట తోడేస్తున్నారు. చివర శ్మశానాలకు కూడా వదలడం లేదు.

- రాత్రి పూట ఎడాపెడా తరలింపు
- రీచ్ లేకున్నా అక్రమ రవాణా
- ట్రెంచ్ కొడుతున్నా మరోమార్గం వెతుకులాట
- శ్మశానాన్ని వదలని ఇసుకాసురులు
- కాపుగాసి పోలీసులకు పట్టించిన యువకులు



ట్రాక్టర్లను పోలీసులకు అప్పగిస్తున్న గ్రామస్తులు, యువకులు (ఇన్‌సెట్) ఏకాంబరకుప్పంలో ముళ్ల కంపలతో దర్శనమిస్తున్న కుశస్థలి నది


రాత్రిపూట వర్షంలోనూ కుశస్థలి నది నుంచి ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

నగరి : ఇసుక అక్రమ తరలింపుదారులు చీకట్లో తమ దందాను కొనసాగిస్తున్నారు. ఎడాపెడా ఇసుకను తరలించేస్తున్నారు. ఇటీవల అధికారులు ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకు ఇసుక తరలించే మార్గంలో ట్రెంచ్ కొట్టినా తరలింపునకు కొత్త మార్గాన్ని వెతుక్కుంటున్నారు. ఇసుకను తరలింపునకు రాత్రి వేళను అనువుగా ఎంచుకున్నారు. వర్షం పడుతున్నా లెక్కచేయక తమ పని చేసుకుపోతున్నారు. ఇసుకను స్టాక్ పాయింట్లనుంచే తీసుకోవాలంటూ ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. మరెక్కడ ఇసుకను తీసుకున్నా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసింది. అయితే అదంతా కాగితాలకే పరిమితమైంది. స్టాక్ పాయింట్ లేని నగరి కుశస్థలి నదిలో ఇసుక తరలింపు యథావిధిగా కొనసాగుతోంది. మండలంలోని తెరణి పంచాయతీలోను, మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేట వద్ద కుశస్థలి నదిలోని ఇసుకను తరలించేస్తున్నారు. ఇప్పటికే బుగ్గ అగ్రహారం నుంచి ఏకాంబరకుప్పం వరకు వాల్టా చట్టాన్ని కూడా లెక్కచేయక ఇసుక తరలించేయడంతో కుశస్థలి నది ముళ్ల కంపలతో దర్శనమిస్తోంది. నది పరివాహక ప్రాంతంలో గట్టుపై ఆయా గ్రామాలకు చెందిన శ్మశాన వాటికలు ఉన్నాయి. ఇసుక తరలింపుదారులు శ్మశాన వాటికలకు వెళ్లే దారిని కూడా వదలకుండా ఇసుకను తవ్వేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన శ్మశాన వాటిక కూడా పూర్తిస్థాయిలో ఇసుకాసురుల వల్ల దెబ్బతింటోందని గ్రామ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వేకువజామున కాపుకాసి ఇసుక తరలింపు ట్రాక్టర్లను అడ్డుకున్న స్థానిక యువకులు పోలీసులకు ఫిర్యాదుచేసి వారికి అప్పగించారు. దీనిపై సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ రాత్రిపూట కుశస్థలి నది నుంచి ఇసుక తరలించే మార్గంలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తామని చెప్పారు.